క్లుప్తంగా

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

నిడదవోలు రూరల్: ఆధార్ బయోమెట్రిక్ నూరు శాతం పూర్తి చేసేందుకు నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ టి.మూర్తిబాబు సూచించారు. శెట్టిపేట గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రెండోరోజు నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాధవీలత ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో ఆధార్ నమోదును చేపడుతున్నామని చెప్పారు. డిజిటల్ అసిస్టెంట్ పి.నవీన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాళ్లపూడి: ప్రక్కిలంక విద్యుత్ సబ్ స్టేషన్‌లో మెయింటెనెన్స్‌లో భాగంగా శుక్రవారం ఉదయం 6.30 గంటల నుంచి 12.30 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. గురువారం ఈ విషయాన్ని విద్యుత్ శాఖ ఏఈ సీహెచ్ వెంకటరావు తెలిపారు. తాళ్లపూడి, ప్రక్కిలంక, పైడిమెట్ట, కుకునూరు, వేగేశ్వరపురం గ్రామాలకు అంతరాయం కలుగుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

నిడదవోలు రూరల్: రైతు సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు అన్నారు. గురువారం తిమ్మరాజుపాలెం ఆర్‌బీకేలో వైఎస్సార్ రైతు భరోసా తొలి విడత సాయంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వైఎస్సార్ రైతు భరోసా కింద నియోజకవర్గంలో 22,006 మంది రైతులకు రూ.12.28 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ తెలిపారు. ఇటీవల వర్షాలకు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ రాయితీ మంజూరైందన్నారు. సర్పంచ్ ముప్పిడి చంద్రశేఖర్, ఎంపీటీసీ పడాల రంగారావు, సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు



బ్రాహ్మణగూడెంలో వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లు

చాగల్లు: బ్రాహ్మణగూడెంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం అన్న సమారాధన జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కూలీలకు మజ్జిగ పంపిణీ

ఉండ్రాజవరం: తాడిపర్రులో ఉపాధి హామీ కూలీలకు స్వీట్లు, మజ్జిగ పంపిణీ చేశారు. చిన్నారులు కత్తుల శరణ్య, నేహిత పుట్టినరోజు సందర్భంగా వీటిని అందజేశారు.

మొక్కల అందజేత



ముక్కామలలో మొక్కలు పంచుతున్న దంపతులు

పెరవలి: పర్యావరణ పరిరక్షణకు ముక్కామల గ్రామానికి చెందిన గూడూరి రామకృష్ణ, మౌనిక దంపతులు ముందుకు వచ్చారు. వారి కుమార్తె కుష్విత పుట్టిన రోజు సందర్భంగా మొత్తం 200 మొక్కలను ప్రజలకు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం తమ వంతు సహకారం అందించినట్లు రామకృష్ణ తెలిపారు.

మండపాకకు వెళ్లి.. పింఛను ఇచ్చి



గాడి రాజుకు పింఛన్ అందిస్తున్న దివ్యాంగ వలంటీర్ కృప

నిడదవోలు: స్థానిక 21వ వార్డులో నివాసముంటున్న దివ్యాంగుడు గాడి రాజు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మంచాన పడ్డాడు. అతనిని చూసేవారు లేక తణుకు మండలం మండపాకలో తన సోదరి ఇంటి వద్ద ఉండి మందులు వాడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న దివ్యాంగురైన వలంటీర్ వంగా కృప సొంత ఖర్చులతో తన మూడు చక్రాల మోటార్ సైకిల్‌పై గురువారం మండపాక వెళ్లి రాజుకు పింఛను అందించారు. వలంటీర్ కృపను మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వార్డు కౌన్సిలర్ కామిశెట్టి వెంకట సత్యనారాయణలు, నిడదవోలు జ్యోతిర్మయి, దివ్యాంగుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు ర్యాలి సత్యనారాయణ (శివ) అభినందించారు.

చదరంగం.. నేర్చుకుందాం

- వేసవి శిబిరంలో శిక్షణ
- ఆసక్తి చూపుతున్న విద్యార్థులు



దూబచర్ల వేసవి శిబిరంలో చదరంగంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

నల్లజర్ల: క్రమశిక్షణ, ఏకాగ్రత, చురుకుదనంతో కూడిన క్రీడ చదరంగం. దీనిని సాధన చేయడం ద్వారా ఆలోచన శక్తి, వేగంగా నిర్ణయాలు తీసుకునే లక్షణాలు అలవడతాయి. ఎదుట వారి ఎత్తులను అర్థం చేసుకుంటూ పైఎత్తులు వేసే నేర్పు సొంతమవుతుంది. అతి ప్రాచీనమైన భారత దేశ క్రీడ ఈ చదరంగం. మేథో క్రీడగా పేర్కొనే చదరంగాన్ని నేర్చుకునేందుకు పిల్లలు ఆసక్తి కనబరుస్తున్నారు. అందుకే ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ తూర్పుగోదావరి జిల్లా ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. నల్లజర్ల మండలం దూబచర్ల శ్రీసంఘ మిత్రా విద్యాలయంలో పార్థ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ, లయన్స్, వాసవీ క్లబ్‌ల సహకారంతో మే 1 నుంచి చదరంగంలో శిక్షణ ఇస్తున్నారు. దూబచర్ల జెడ్పీ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు, యోగమిత్ర దూబగుంట్ల రాజారావు విద్యార్థులకు క్రీడలో మెలకువలు నేర్పుతున్నారు. సుమారు 30 మంది విద్యార్థులు చదరంగంలో శిక్షణ పొందుతున్నారు. వీరు ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకూ సాధన చేస్తూ నైపుణ్యాలు, ఆలోచనా శక్తిని పెంచుకుంటున్నారు. చిన్నారులను వారి తల్లిదండ్రులు ప్రోత్సహించడంతో శిక్షణ తరగతుల్లో పాల్గొంటున్నారు.

సాధన చేస్తే మెరికలే..



జిల్లాలో ఇక్కడే చదరంగంలో శిక్షణ శిబిరం ఉంది. పదేళ్లుగా యోగాతో పాటు చదరంగంలో శిక్షణ ఇస్తున్నాం. నా దగ్గర నేర్చుకున్న విద్యార్థులు చాలామంది జాతీయ స్థాయి పతకాలు సాధించారు. ఇక్కడ శిక్షణ తర్వాత కూడా సాధన చేస్తే మంచిది. అప్పుడే మెరికల్లా తయారు కావొచ్చు.

–దూబగుంట్ల రాజారావు, శిక్షకుడు, దూబచర్ల

ఆనందంగా ఉంది



వేసవిలో విద్యార్థులు ఎండలో తిరగకుండా నీడపట్టున కూర్చుని శారీరక, మానసిక ఆనందం ఇచ్చే ఉత్తమ క్రీడ చదరంగం. జిల్లాలో ఇక్కడ మాత్రమే శిక్షణకు అనుమతి ఇచ్చారు. అటువంటి శిక్షణ శిబిరానికి ఆతిథ్యమివ్వడం చాలా ఆనందంగా ఉంది.

–అంబటి శ్రీనివాసరావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, దూబచర్ల

పోటీల్లో రాణించాలన్నదే లక్ష్యం



మా ఊరు ఘంటావారిగూడెం. నేను 7వ తరగతి చదువుతున్నాను. చదరంగంపై ఆసక్తితో ఈ శిబిరంలో చేరాను. నైపుణ్యాలు పెంచుకుని ఈ క్రీడలో రాణించాలనే లక్ష్యంతో సాధన చేస్తున్నాను. వేసవి సెలవుల్లో ఇస్తున్న ఉచిత శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుంది.

–ఈలప్రోలు శ్రీరాం, ఘంటావారిగూడెం

'నాడు-నేడు' పనులతో మహర్దశ

- బడులు తెరిచే నాటికి పూర్తి చేయండి
- హెచ్‌ఎంలకు డీఈఓ అబ్రహం ఆదేశం



దుద్దుకూరులో నాడు-నేడు పనుల పురోగతిపై సమీక్షిస్తున్న డీఈఓ అబ్రహం

దేవరపల్లి: 'నాడు-నేడు' కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పడుతుందని, ఈ పథకంలో గోపాలపురం నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం ఆదేశించారు. దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల్లో నాడు-నేడు రెండో విడతలో చేపట్టిన పనుల పురోగతి, నిధుల వినియోగంపై దుద్దుకూరులోని ఫంక్షన్ హాల్‌లో గురువారం హెచ్‌ఎంలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడు పనులకు నిధులు మంజూరు చేసి ఖాతాల్లో వేసినప్పటికీ ఇంకా ఎందుకు ఖర్చు చేయడం లేదని హెచ్‌ఎంలను ప్రశ్నించారు. నిధులు విడుదలై ఏడాది పూర్తయినా ఇంత వరకూ ఎందుకు పనులు పూర్తి కాలేదని ఆయన అడిగారు. ఒక్కో పాఠశాలలో రూ.5 లక్షల నుంచి 25 లక్షల నిధులు ఖాతాల్లో ఉండిపోయాయని అన్నారు. ఈ నెల 11 నాటికి పనులు పూర్తి చేసి, విద్యార్థులకు సౌకర్యాలు కల్పించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాలల వద్ద టాయిలెట్లు, వంట షెడ్లు, భవనాల నిర్మాణం, విద్యుత్ సదుపాయం, పెయింటింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. 33 శాతం నిధులు ఖర్చు చేసిన పాఠశాలల బ్యాంకు ఖాతాలకు బుధవారం నిధులు జమ చేసినట్టు ఆయన తెలిపారు. ప్రతి పాఠశాల వద్ద తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు. జిల్లాలో రెండో విడత నాడు-నేడు కార్యక్రమంలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.336 కోట్లు మంజూరు చేసినట్టు చెప్పారు. మండల కేంద్రాలకు చేరుకున్న జగనన్న విద్యా కానుకలను ఈ నెల 4వ తేదీ నుంచి పాఠశాలలకు సరఫరా చేస్తున్నట్టు ఆయన తెలిపారు. స్టాక్ పాయింట్ నుంచి హెచ్‌ఎంలు వీటిని తీసుకువెళ్లాలని, దీనికి అయ్యే రవాణా ఖర్చులను ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. 12న అన్ని పాఠశాలల్లో విద్యా కానుకలు పంపిణీ చేయాలని డీఈఓ అబ్రహం ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు పూర్తయిన పిల్లలను ప్రాథమిక పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేర్పుకోవాలన్నారు. ఈ బాధ్యత ఉపాధ్యాయులదేనని చెప్పారు. మండలంలోని జెడ్పీ హైస్కూళ్లలో 10వ తరగతి ఉత్తీర్ణులైన బాలికలను దేవరపల్లిలోని బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఎం.తిరుమలదాస్, శ్రీనివాసరావు, నాడు-నేడు కార్యక్రమం ఏఈలు కె.వీరాస్వామి, ఎంఎస్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ఎనలేనివి




ఆవపాడులో వలంటీర్లను సత్కరించిన వైస్ ఎంపీపీ శివాజీరావు తదితరులు

నల్లజర్ల: ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేయడంతో వలంటీర్ల సేవలు ఎనలేనివని వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీరావు అన్నారు. ఆవపాడు సచివాలయంలో గురువారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించడంలో వలంటీర్లే కీలకంగా పని చేస్తున్నారన్నారు. అనంతరం 12 మంది వలంటీర్లను ప్రశంసా పత్రాలు, మెడల్స్‌తో సత్కరించారు. గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అచ్యుత వెంకటస్వామి (పెదకాపు), జోగినీడి నాగు, మద్దూరి విష్ణు, విద్యా కమిటీ చైర్మన్ రుద్రా శ్రీను, మద్దూరి నాగేశ్వరరావు, గ్రామ కార్యదర్శి లావణ్య పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు

దేవరపల్లి: చిన్నారుల్లో రక్తహీనత సమస్య నివారణకు బంగారు కొండ పథకం తోడ్పడుతుందని మండల ప్రత్యేక అధికారి రాధాకృష్ణ తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బంగారు కొండ పథకంపై అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు, గ్రామ సచివాలయ కార్యదర్శులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రత్యేక అధికారి రాధాకృష్ణ మాట్లాడుతూ రక్తహీనత గల పిల్లలను గుర్తించి వారికి పౌష్టికాహారం అందించాలన్నారు. ఐసీడీఎస్ పీఓ సుందరి మాట్లాడుతూ మండలంలో 44 మంది పిల్లలను గుర్తించి పౌష్టికాహారం అందిస్తున్నట్టు వివరించారు. ఈ పథకాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత అంగన్‌వాడీ సిబ్బందిపై ఉందన్నారు. సదస్సులో తహసీల్దార్ ఎం.రామకృష్ణ, ఎంపీడీఓ కె.ఉమామహేశ్వరశర్మ, ఈఓపీఆర్డీ పి.రామచంద్రరావు పాల్గొన్నారు.

ఒట్టు... స్విమ్మింగ్ పూలే



కొవ్వూరు సత్యవతినగర్‌లో అసంపూర్తిగా వదిలేసిన స్విమ్మింగ్ పూల్‌లో గేదెలు

కొవ్వూరు: ఈ చిత్రం చూశారా.. బురద గుంట కాదు.. అలాగని చెరువూ కాదు.. టీడీపీ హయాంలో చేపట్టిన స్విమ్మింగ్ పూల్ ఇది. అసంపూర్తి పనులతో ఇలా గేదెలకు ఆవాసంగా మారింది. కొవ్వూరు పట్టణంలో పరిస్థితి ఇది. స్థానిక సత్యవతినగర్‌లో ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) రూ.2 కోట్ల అంచనాతో స్విమ్మింగ్ పూల్, క్రీడా మైదానం కోసం 2018 జనవరి 23న అప్పటి ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రిగా పనిచేసిన కేఎస్ జవహర్ శంకుస్థాపన చేశారు. అప్పట్లో స్విమ్మింగ్ పూల్ నిర్మించే లేఅవుట్ ప్రాంతం టీడీపీ నాయకుడికి చెందినది. శంకుస్థాపనలు చేసి పనులు అసంపూర్తిగా విడిచిపెట్టడంతో నేడు గేదెలు మసలడానికి ఉపయోగపడుతోంది. ఇక్కడ వర్షపు నీరు చేరి పసరు పట్టి మురుగు కూపంలా మారింది. ఈ స్విమ్మింగ్ పూల్ మనుషులకు కాదు... గేదెలకంటూ పలువురు చమత్కరిస్తున్నారు.

ఉద్యోగులకు బదిలీలు

ద్వారకాతిరుమల: రాష్ట్ర దేవదాయశాఖ పరిధిలోని ఆలయాల్లో సిబ్బందికి బదిలీలు జరిగాయి. జూనియర్ అసిస్టెంట్ స్థాయి నుంచి ఆపై క్యాడర్‌లోని ఉద్యోగులను బదిలీలు చేస్తూ ఆ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. పలువురు ఉద్యోగులను డిప్యుటేషన్ (రెండేళ్ల కాల పరిమితి)పై, మిగిలిన వారిని సాధారణ పద్ధతిలో బదిలీలు చేశారు. ఇందులో భాగంగా ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో వివిధ క్యాడర్‌లో పనిచేస్తున్న 9 మంది ఉద్యోగులను అన్నవరం వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం, విజయవాడ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, సింహాచలం వరాహ లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానాలకు బదిలీ చేశారు. అలాగే ఆయా ఆలయాల నుంచి ద్వారకాతిరుమల దేవస్థానానికి 8 మంది ఉద్యోగులు రానున్నారు.

సీఐటీయూ ధర్నా

కొవ్వూరు: మహిళా మల్లయోధులపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌పై తక్షణం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ మాణిక్యాంబ, వి.శ్రీదేవి, చిన్న లక్ష్మి, శాంతకుమారి పాల్గొన్నారు.

చోరీ ఘటనపై కేసు నమోదు

చాగల్లు: మల్లవరంలోని ఓ ఇంట్లో రూ.95 వేల విలువైన బంగారు, వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గురువారం కేసు నమోదు చేశామని ఎస్సై సీహెచ్‌వీ రమేష్ తెలిపారు. గ్రామానికి చెందిన లకంసాని శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కలసి గత నెల 13న పాలకొల్లు వెళ్లారు. ఇంటికి వేసిన తాళం పగలగొట్టి ఉండటాన్ని గమనించి బంధువులు సమాచారం ఇచ్చారు. ఇంటికి వచ్చి చూడగా బీరువాలోని బంగారు, వెండి ఆభరణాలు కనిపించకపోవడంతో శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పశ్చిమ డెల్టాకు నీటి విడుదల



విజ్జేశ్వరం హెడ్ స్లూయిస్ వద్ద గోదావరి మాతకు పూజలు చేస్తున్న డీఈ సత్యదేవ

నిడదవోలు: విజ్జేశ్వరంలోని హెడ్ స్లూయిజ్ నుంచి గోదావరి జలాలను పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు ఇరిగేషన్ అధికారులు గురువారం విడుదల చేశారు. హెడ్ స్లూయిజ్‌కు మామిడి తోరణాలు కట్టి సుందరంగా అలంకరించారు. ముందుగా వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య తాడేపల్లిగూడెం ఇరిగేషన్ డీఈ వి.సత్యదేవ గోదావరి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోదావరికి నూతన వస్త్రాలు, పసుపు కుంకుమ సమర్పించారు. అనంతరం హెడ్ స్లూయిస్ స్విచ్‌ఆన్ చేసి పశ్చిమ డెల్టాకు ముందుగా 50 క్యూసెక్కుల నీటి విడుదల చేశారు. దశల వారీగా సాయంత్రానికి 100 క్యూసెక్కులకు పెంచుతూ నీటిని వదిలారు. ఐసీ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, లాక్ సూపరింటెండెంట్ విక్రమ్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం



నల్లజర్లలో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- నల్లజర్లలో గడప గడపకూ..

నల్లజర్ల: పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. గురువారం నల్లజర్లలోని 8, 10 వార్డుల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సర్పంచ్ పల్లి జ్యోతి, ఉప సర్పంచ్ రాయుడు విజయకుమార్, వైస్ ఎంపీపీ ఆరుగొల్లు మణి, ఎంపీటీసీ మేడ్డి వెంకటలక్ష్మి, గ్రామ కమిటీ అధ్యక్షుడు కండెపు రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగింది. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాల్లో ఎవరెవరికి ఏ మేరకు ప్రయోజనం చేకూరిందో కరపత్రాల ద్వారా వివరించారు. ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో పయనించాలని సీఎం జగన్ ప్రత్యేక విజన్‌తో పని చేస్తున్నారన్నారని ఎమ్మెల్యే వెంకట్రావు అన్నారు. విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. నల్లజర్ల- జగన్నాథపురం రహదారిని అభివృద్ధి చేయాలని, ప్రధాన డ్రైన్‌ను ఆధునీకరించాలని స్థానికులు కోరారు. దీనిపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. తహసీల్దార్ కిశోర్ కుమార్, ఎంపీడీఓ జోగేశ్వరరావు, మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, నల్లజర్ల సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, నాయకులు వెల్లంకి వెంకటసుబ్రహ్మణ్యం, బంక అప్పారావు, మద్దిపాటి ప్రసాద్, పిచ్చుకల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పక్కా ప్రణాళికతో భూ సర్వే చేపట్టాలి



టౌన్ ప్లానింగ్ కార్యదర్శులకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఆదినారాయణ

నిడదవోలు: పక్కా ప్రణాళికతో సమగ్ర భూ సర్వే చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వైఎస్సార్-జగనన్న భూహక్కు భూరక్ష పథకంలో భాగంగా 13 మంది టౌన్ ప్లానింగ్ కార్యదర్శులకు ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ ఆదినారాయణ మాట్లాడుతూ సర్వే బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి తప్పనిసరిగా అసెస్‌మెంట్, బ్లాక్ నంబర్లను గుర్తించి పక్కాగా సర్వే చేయాలన్నారు. సమగ్ర భూసర్వేతో స్థలాల విభజన, యజమానులకు సర్వే నంబర్లతో సహా శాశ్వత భూహక్కు పత్రాలను అందించేందుకు ప్రభుత్వం సమగ్ర భూ సర్వేను చేపడుతోందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, కౌన్సిలర్ గోపిరెడ్డి శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ అధికారి ఎస్.సుప్రియ, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ కె.సుజాత, సీనియర్ అసిస్టెంట్ ఇబ్రహీం పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యం



కానూరులో కూచిపూడి నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పెరవలి: భారతదేశం సంస్కృతీ సంప్రదాయాలకు నెలవని రామకృష్ణా సేవా సమితి కార్యదర్శి ప్రసాద్‌రాజు తెలిపారు. గురువారం కానూరులో రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో వేసవి శిక్షణ కార్యక్రమాల ముగింపు గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి ఎంత డబ్బు సంపాదించినా కళలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఈ శిక్షణ కాలంలో యోగా, కూచిపూడి నృత్యం, ధ్యానం, చదవడం వంటి వాటిని విద్యార్థులకు నేర్పించామన్నారు. అనంతరం విద్యార్థుల కూచిపూడి నృత్యం అలరించింది. కార్యక్రమంలో నడుపల్లి సర్పంచ్ బీరా సత్యవేణిరాజు, కానూరు సర్పంచ్ భావన మధు, సమితి సభ్యులు పాల్గొన్నారు.

రైతు భరోసాతో సాగుకు పండుగ

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



నల్లజర్లలో రైతు భరోసా నమూనా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నల్లజర్ల: రైతు భరోసా సాయం సాగును పండుగలా మార్చుతుందని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. గోపాలపురం నియోజకవర్గంలో 37,686 మంది రైతులకు రూ.28.26 కోట్ల రైతు భరోసా పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమ చేశారని వెల్లడించారు. వరుసగా ఐదో ఏడాది తొలి విడత సాయంగా అందించినట్టు నల్లజర్లలో గురువారం ఆయన తెలిపారు. సాగులో పెట్టుబడికి రైతులు ఇబ్బంది పడకుండా ఇది ఉపయోగపడుతుందని వివరించారు. రైతుకు మంచి జరగాలన్న తపనతో సీఎం జగన్ ఏటా రూ.13,500 రైతు భరోసా కింద అందిస్తున్నారన్నారు. రబీ సీజన్‌కు సంబంధించి 36,843 టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, 27,937 టన్నుల ధాన్యానికి రూ.56.99 కోట్ల సొమ్ము రైతుల ఖాతాలలో జమ చేశారన్నారు. అనంతరం రైతు భరోసాకు సంబంధించి నమూనా చెక్కును ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిశోర్‌కుమార్, ఎంపీడీఓ జోగేశ్వరరావు, వ్యవసాయాధికారి కమల్‌రాజ్, గగ్గర శ్రీనివాస్, కారుమంచి రమేష్, వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, బంక అప్పారావు, మద్దిపాటి ప్రసాద్, వైస్ ఎంపీపీ ఆరుగొల్లు మణి, సర్పంచ్ పల్లి జ్యోతి పాల్గొన్నారు.